కమల సారథి ఎవరు ?

బీజేపీ జిల్లా అధ్యక్ష రేసులో ఐదుగురు

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిని నేడు ఎంపిక చేయబోతున్నారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయనుండగా ఏలూరులో అధ్యక్ష స్థానం కోసం సీనియర్ల మధ్య పోటీ ఉంది. ఇప్పటికే బూత్, మండల స్థాయిలో కమిటీల ఎన్నికలు దాదాపు పూర్తికాగా ఆ తదుపరి అధ్యక్షుడి ఎంపిక ఏకగ్రీవ నిర్ణయంతో పూర్తి చేయాలని బీజేపీ భావిస్తోంది.

విక్రమ్ కిశోర్, ఇందుకూరి చక్రవర్తి వర్మ, కట్నేని కృష్ణప్రసాద్, కారంకి శ్రీనివాస్, పెనుమత్స రామచంద్రరాజు

ఇప్పటికే పార్టీపరంగా అభిప్రాయ సేకరణ | పోటీ తీవ్రం..నేడు పార్టీ పెద్దలతో సమావేశం | ఏకాభిప్రాయం తరువాతే అధ్యక్షుడి ఎంపిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

భారతీయ జనతా పార్టీ జిల్లా సారథి పదవి కోసం హోరాహోరీ పోటీ నెలకొంది. ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా పార్టీ సీనియర్లు బరిలో ఉన్నారు. గడిచిన రెండు నెలలుగా భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలు బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కొన సాగుతూ వచ్చాయి. గతంలోనూ ఎక్కడికక్కడ ఈ కమిటీలకు సారథ్యం వహించేందుకు పెద్దగా ఎవరూ ముందుకు రాకపోతే చురుగ్గా ఉన్న వారిని పార్టీ నాయ కత్వం నామినేట్ చేసేది. కానీ ఇప్పుడు మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రత్యేకించి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం పార్టీ నేతల మధ్య పదవుల పోటీ పెంచినట్టయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గానికి చెందిన సీహెచ్ విక్రమ్ కిషోర్ ఉన్నారు. ప్రతీ మూడేళ్ళకోసారి జిల్లా అధ్యక్షుడితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకోవడం బీజేపీలో ఆనవాయితీ. అయితే ఇప్పటిదాకా అధ్యక్షుడిగా విక్రమ్ కిషోర్ ఏడాదిన్నరపాటు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. ఇదే తరుణంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన దగ్గర నుంచి ముగిసే నాటికి ఏక పద్ధతిలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించారు. దాదాపు అన్ని జిల్లాల అధ్యక్ష ఎంపికలు ఇదే ప్రక్రియలో కొనసాగుతాయి. దీంతో మిగతా జిల్లాల మాదిరిగానే ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంది. ఈ దశలో గడిచిన పక్షం రోజులుగా మండలాలకు ఎన్నికైన అధ్యక్షుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. జిల్లా పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారో అభిప్రాయాలను సేకరించి క్రోడీకరించారు. ఆ మేరకు ఎక్కడికక్కడ మండల పార్టీ అధ్యక్షులు కూడా తమ అభిప్రాయాలను పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లకు తెలియజేశారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్న విక్రమ్ కిషోర్‌తో పాటు మరికొందరి నేతల పేర్లను కొందరు బహిర్గత పరిచారు. మరికొందరు సీని యర్లు జిల్లా అధ్యక్ష పగ్గాలు చేపట్టాలని ఆతృతతో ఉన్నారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షులను ప్రసన్నం చేసు కునేందుకు ప్రయత్నించారు. పార్టీకి, కార్యకర్తలకు నిర్విరామ సేవలు కొనసాగాలన్నా, అందుబాటులో ఉండాలన్నా తమ కున్న అర్హతలను వివరించే ప్రయత్నం చేశారు.

ఈ ఐదుగురిలో ఎవరికి ఛాన్స్ ?

ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు సీనియర్ల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. అగ్రనాయకత్వం దగ్గర నుంచి క్షేత్రస్థాయి వరకు అందరి మన్ననలు పొంది మంచి మార్కులు దక్కించేందుకు ఇప్పటిదాకా విశ్వ ప్రయత్నాలు చేశారు. ప్రత్యేకించి భార తీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల స్వరూపాన్ని ఈసారి ఒకింత మార్చడంతో ఆది నుంచి అప్రమత్తంగానే ఉన్నారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షునిగా విక్రమ్‌కిశోర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణప్రసాద్ కొనసాగుతున్నారు. వీరిద్దరు తాజాగా జరగబోయే అధ్యక్ష స్థానం పోటీలో నేరుగా ఢీకొంటున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విక్రమ్ కిశోర్ గత ఏడాదిన్నర క్రితమే ఈ పదవికి ఎన్నికయ్యారు. ఆయనతోపాటు జిల్లా కార్యవర్గం కూడా ఎన్నికైంది. అయితే తనకు మరో ఛాన్స్ ఇవ్వాలని మూడేళ్ళ పదవీ కాలం ఉండగానే ఏడాదిన్నరలోపే ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో తాను నష్టపోతున్న విషయాన్ని పార్టీ నేతల వద్ద ప్రస్తావించినట్టు చెబుతున్నారు. భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తున్న తరుణంలో ఎలాంటి వివాదాలు లేకుండానే స్నేహపూరిత వాతావరణంలో తంతు ముగించాలని నేతలు భావిస్తున్నారు. జిల్లా అధ్యక్ష స్థానం కోసం చాన్నాళ్ళుగా పోటీ పడుతున్న మరో నేత, ప్రస్తుత జిల్లా కార్యదర్శి కృష్ణప్రసాద్ ఈసారి అధ్యక్షస్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన రెండు దఫాలుగా ఆయన ఈ స్థానం కోసం ప్రయత్నించగా ఒకసారి సుధాకర్ కృష్ణ, మరొకసారి విక్రమ్ కిశోర్‌ను జిల్లా అధ్యక్ష స్థానం వరించాయి. ఇప్పటికే పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆయన తనకున్న కేడర్, బలం, పార్టీలో పట్టు వీటన్నింటినీ క్రోడీకరించి మరీ పోటీలో ఉన్నారు. కృష్ణప్రసాద్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. ఇంతకుముందు సీనియర్ నేత కావూరి సాంబశివరావుకు ముఖ్య అనుచరుడు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవితో పాటు ఏలూరు పార్లమెంటు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి నుంచి ఇదే జిల్లాలో సీనియర్ అయిన తపన చౌదరితోపాటు ఆయన అనేక కార్యక్రమాల్లో కీలక పాత్ర వహించారు. ఆయన సామాజిక వర్గం నుంచి మరికొందరు ఇతర జిల్లాల్లో పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణప్రసాద్‌కు ఈసారి అవకాశం వస్తుందా ? రాదా అనేది నేడు తేలిపోనుంది. ఇదిలా ఉండగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న కొయ్యల గూడేనికి చెందిన బీసీ సామాజిక వర్గం నుంచి కారంకి శ్రీనివాస్ కూడా తనకో ఛాన్స్ ఇవ్వాలని గట్టిగానే కోరుతున్నారు. ఇంతకుముందు పార్టీలో తాను పోషించిన పాత్రను గుర్తు చేస్తున్నారు. ఈ ముగ్గురితోపాటు ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలు సైతం అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. గణప వరానికి చెందిన చక్రవర్తివర్మ ఇందుకూరితో పాటు పెన్మత్స రామ చంద్రరాజు (దుబాయ్ రాజు) బరిలో ఉన్నారు. ఇద్దరు క్షత్రియ సామాజిక వర్గానికి, ఎస్సీ, బీసీ, కమ్మ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు పోటీలో నిలిచారు. వీరిలో కృష్ణప్రసాద్, విక్రమ్‌కిషోర్, కారంకి శ్రీనివాస్‌లలో ఒకరికి ఛాన్స్ దక్కబోతుందని పార్టీలో బలంగా వినిపిస్తున్నది.

నేడు ఏలూరులో పార్టీ వర్గాల భేటీ

జిల్లా అధ్యక్ష స్థానానికి పోటీ పడే వారి సంఖ్య పెద్ద సంఖ్యలో ఉండడం ఆ పార్టీలోనే అందరిని విస్తుపోయేలా చేస్తున్నది. ఏకాభిప్రాయంతో వీరందరి మధ్య సయోధ్య కుదిర్చి వీరిలో ఒకరిని అధ్యక్షుడిగా ప్రకటించేందుకు నేడు ఏలూరులో పార్టీ ముఖ్యులు సమావేశం అవుతారు.అశోక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరగనుండగా, అందరి దృష్టి ఆవైపే మళ్లింది. పార్టీ పరి శీలకులు సమావేశానికి హాజరవుతారు. వివిధ సామాజిక వర్గాల మధ్య సమతుల్యత సాధించేలా నిర్ణయాలు ఉంటాయని పార్టీ నేతలు భావిస్తున్నారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే గేట్ క్లోజ్

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీల్లో అడ్మిషన్లకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలి సెషన్ ఆన్‌లైన్ (సీబీటీ) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జిల్లాకు సంబంధించి ఈ పరీక్షలు ఏలూరు శివారులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, మెయిన్ బైపాస్‌రోడ్డు దుగ్గిరాల పరిధిలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరుగుతాయి. తొలి సెషన్‌లో ఈనెల 22, 23, 24 తేదీల్లో జరిగే పరీక్షలకు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉదయం, సాయంత్రం 120 మంది విద్యార్థులు చొప్పున, వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలుకు పూటకు 180 మంది చొప్పున కేటాయించారు. 28, 29, 30తేదీల్లో జరిగే పరీక్షలకు ఇవే కేంద్రాలకు అదనంగా మెయిన్ బైపాస్ రోడ్డు సమీపంలో వున్న దుగ్గిరాలలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కూడా పూటకు వందమంది విద్యార్థులు వంతున పరీక్షలు జరుగుతాయి. ఈ మూడు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సుమారు 5 వేలమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా కేంద్రాల వారీగా కేటాయించిన తుది పరీక్షార్థుల సంఖ్య మంగళవారం ఖరారవుతుంది. 22 నుంచి 29 వరకు పేపర్-1 (బీఈ/బీటెక్) పరీక్షలు, 30న పేపర్-2 (బీఆర్క్, బీప్లానింగ్)పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలకు ఎన్టీయే ఆధ్వర్యంలో టీసీఎస్ సంస్థ నిర్వహిస్తుంది.

అరగంట ముందే 'గేట్ క్లోజ్' నిబంధన

ఈ దఫా జెఈఈ మెయిన్స్ పరీక్షలకు 'గేట్ క్లోజ్ టైం ' నిబంధనను పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) అమల్లోకి తెచ్చింది. పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి అరగంటముందే పరీక్షకేంద్రం మెయిన్ గేట్‌ను మూసివేస్తారు. అంటే ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు ముందుగానే విద్యార్థులు లోపలికి వెళ్ళిపోవాలని తర్వాత ఖచ్చితంగా ప్రధాన ప్రవేశ ద్వారాన్ని మూసివేస్తామని వెల్లడించారు. 'గేట్ క్లోజ్ టైం' తర్వాత వచ్చినవారిని కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షార్థులు తమ అడ్మిట్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు, దరఖాస్తు చేసినపుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటో గుర్తింపుకార్డు ఒరిజినల్ కాపీ, ఒక పెన్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువులేవీ తీసుకురావద్దని సూచించారు. పరీక్షలకు సిటీ కో-ఆర్డినేటర్‌గా పి.సాయికుమారి శంకర్, ఎన్టీయే తరపున జిల్లా నోడల్ ఆఫీసర్‌గా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారు.

సమగ్రశిక్ష ప్రక్షాళనపై కలెక్టర్‌కు ప్రతిపాదనలు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో ప్రభుత్వ అనుమతులు, కొనసాగింపు ఉత్తర్వులు లేకుండా దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివిధ సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు, ఇతర విభాగాల ఉద్యోగులను తొలగించి వారిస్థానే కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా నియామకాలు చేపట్టేందుకు ఉద్దేశించిన ఫైళ్ళను ఎస్ఎస్ఏ ఏపీసీ పంకజ్‌కుమార్ కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సంబంధిత సిబ్బంది గురించి ఏపీసీతో చర్చించినట్టు సమాచారం. ఇదే విషయమై ఏపీసీ మాట్లాడుతూ సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో నియామకాలు చేపట్టవలసి వున్న సీఎంవో, ఏఎస్‌వో, అసిస్టెంట్ ఏఎంవో (ఉర్దూ) పోస్టుల భర్తీతో పాటు గవర్నమెంట్ నుంచి ఎక్స్‌టెన్షన్ లేకుండా వివిధ పోస్టుల్లో కొనసాగుతున్న వారినందరినీ వెనక్కి పంపాలని అభ్యర్థిస్తూ కలెక్టర్‌కు నోటిఫికేషన్ ప్రతిపాదనలను అందజేశామన్నారు. కొద్దిరోజుల్లోనే ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టు మొత్తాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు వెల్లడించారు.

గ్రామాలను దత్తత తీసుకోండి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు

ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమస్యలను పరిష్కరించడానికి ఒక గ్రామాన్ని జిల్లా, మండల స్థాయి అధికారులు దత్తత తీసుకుని మార్పు చూపిస్తే ప్రజలు మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాల్లో విద్య, వైద్యం, ఉపాధి, పారిశుధ్యం, మంచి నీరు, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత పెంపుదలకు కృషి చేస్తే మార్పు తథ్యమని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై సర్వే చేయాలని, అనంతరం గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత వివరాలను సేకరించి, వారికి అభిరుచి కలిగిన అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సోలార్ వెండర్స్‌తో సమావేశంలో ఎస్ఈ

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరుసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దీని వల్ల విద్యుత్ ఆదా అవుతుందని ఏపి ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్‌రాజు చెప్పారు. ఏలూరు ఆర్ఆర్‌పేట విద్యుత్ భవన్‌లో రిజిస్టర్డ్ సోలార్ వెండర్లతో నిర్వహించిన సమావేశంలో సాల్మన్‌రాజు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారులకు త్వరితగతిన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసేటప్పుడు ఎదురయ్యే అవరోధాలను సమీక్షించి అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందగోరే విద్యుత్ వినియోగదారులకు చక్కని సహకారం అందించాలన్నారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు డివిజన్ ఈఈ కెఎం అంబేద్కర్, ఈఈ టెక్నికల్ రాధాకృష్ణ, ఏలూరు జిల్లా సోలార్ నోడల్ అధికారి రమాదేవి, 18 కంపెనీలకు చెందిన సోలార్ వెండర్స్ , విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ అర్జీకి పరిష్కారం చూపాలి

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. 247 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్జీల పరిష్కారం తీరును సీఎంవో కార్యాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిశీలిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్‌వో విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అత్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, స్పెషల్ కలెక్టర్లు ముక్కంటి, కె.భాస్కర్ అర్జీలు స్వీకరించారు.

దివ్యాంగ పింఛన్ అందజేయండి

పెదవేగి మండలం తాళ్ల గోకవరం చెందిన తిరుపతి కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏడాది క్రితం కూలిపనికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడిపోయాడు. అప్పటి నుంచి అతడికి రెండు కాళ్లు పనిచేయకుండా పోయాయి. మంచానికే పరిమితం అయ్యాడు. దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసినా రాకపోవడంతో తనకు పింఛన్ మంజూరు చేయాలంటూ స్ట్రెచర్ మీదే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి కలెక్టర్‌ను వేడుకున్నాడు.

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు

ఏలూరు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు తెలివిగా పలు రకాలుగా మభ్యపెడతారని ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 40 ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎవరికి కూడా ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

బాధితుల గోడు వంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పది విద్యుత్ మీటర్లు ఉన్నాయని పథకాలకు దూరం !

ఉండటానికి సరైన గూడు కూడా లేదు.. ఒక కాంప్లెక్స్ ఉందని దాంట్లో 10 విద్యుత్ మీటర్లు ఉన్నాయన్న కారణంతో ప్రభుత్వ పథకాలకు అందడం లేదని తన పేరిట ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించాలని కోరుతూ ఏలూరు దక్షిణపు వీధికి చెందిన పోకల నాగమణి కలెక్టర్‌ను వేడుకుంది. ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ పథకం అందుకోలేదని కారణం ఏమిటని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తన పేరున పది విద్యుత్ మీటర్లు ఉన్నట్లు చూపుతోందన్నారు. తన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది.

విధివంచిత బాలలకు ఆసరా వాత్సల్య

ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా నెలకు రూ.4 వేలు

ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో తల్లిదండ్రులు దూరమై నిస్సహాయస్థితిలో ఉన్న పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారుల బతుకు దుర్భరం. భార్య భర్తల మధ్య గొడవల కారణంగా ఆత్మహత్యకు పాల్పడటం, కక్షలతో ఒకరిని ఒకరు చంపుకోవడం, ఇతర కారణాలతో ఒంటరి జీవితాలను గడుపుతున్న బాలలకు, యువతకు ప్రధానమంత్రి మిషన్ వాత్సల్య బతుకుపై కొత్త ఆశలను కల్పిస్తోంది. కుటుంబానికి ఆధారమైన పెద్ద ఎవరైనా కోల్పోతే ఆ కుటుంబానికి తీరని లోటు. ఇది ఆ కుటుంబంలోని బాల్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాంటి కుటుంబాల్లోని 0 నుంచి 18 ఏళ్లలోపు వారికి మిషన్ వాత్సల్య అండగా నిలుస్తోంది. జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న 2023 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకం మూడేళ్ల క్రితం కూడా కరోనాతో అసువులు బాసిన కుటుంబంలోని చిన్నారులను ఆదుకొంది. జిల్లాలో కరోనాతో అనాథలుగా మారిన పిల్లలకు ఏడుగురికి, అనాథలు 85 మంది, కుటంబంలో తల్లి లేదా తండ్రి ఆసరాతో జీవిస్తున్న 315 మంది, హెచ్ఐవీ బాధితులు ఏడుగురు, మానసిక దివ్యాంగులకు ముగ్గురికి ఈ పథకం కింద ఆర్నెళ్లకు ఒకసారి రూ.24 వేల చొప్పున అందిస్తున్నారు.

441 మందికి రూ.కోటి 76 లక్షలు

బాలలు కుటుంబాన్ని విడిచిపెట్టి ఏదైనా ఇనిస్టిట్యూట్, ప్రభుత్వ, ఇతర పాఠశాలల్లో చేరినప్పుడు ఈ పథకం వర్తింపచేస్తారు. పిల్లలు 30 రోజులకు మించి పాఠశాలకు హాజరు కాకపోతే స్పాన్సర్‌షిప్ నిలిపి వేస్తారు. ఈ పథకానికి అర్హులైన పిల్లలు భవిష్యత్‌లో ఏదైనా హాస్టల్‌లో చేరితే అక్కడ నుంచి పథకాన్ని నిలుపుదల చేస్తారు. స్పాన్సర్‌షిప్ కమిటీ ప్రతీ సంవత్సరం ఈ పథకాన్ని సమీక్షించి జిల్లా కమిటీ స్పాన్సర్‌షిప్‌ను రిలీజ్ చేస్తుంది. పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. జిల్లాలో పారదర్శకంగా ఈ పథకం అమలు చేస్తున్నామి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శారద తెలిపారు. గతేడాది 441 మందికి 1 కోటి 76 లక్షలు అందజేశాం. వివిధ కారణాల రీత్యా 24 మందికి రద్దు చేశాం.. ఇక కొత్తగా దరఖాస్తులను స్వీకరించడం లేదని, వస్తే రాష్ట్ర కార్యాలయానికి పంపుతున్నట్లు వివరించారు.

ముందు చూపు పథకం ఇది

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందు చూపుతో పేదలకు ఆసరాగా అమలు చేస్తున్న పథకం ఇది. ఎందరో విధివంచితులైన బాలలకు ఇది చాలా ప్రయోజనకరం. కేంద్రం కూడా తన వంతుగా సహాయాన్ని జిల్లా ప్రాజెక్టులకు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను మంచి పథకాల్లో భాగస్వామ్యం వహించేలా చూస్తున్నారు.

- నడపన దాన భాస్కరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చారిత్రక ఆనవాళ్లకు సమాధి

పోలవరం ముంపులో రుద్రమ్మకోట

మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు

ఆది మానవులు నడిచినట్టు నిర్ధారణ

ఆ రాతి నిర్మాణాలే.. సమాధులు

త్వరలో ఈ ఊరికి జల సమాధి

ఆ ఊరి పేరు రుద్రమ్మకోట. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని గోదావరి తీర గ్రామం. మూడు వేల సంవత్సరాల క్రితం ఆది మానవులు ఇక్కడ సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. చనిపోయిన వారికి సమాధులు ఉన్నాయి. వీటిని పురావస్తు శాఖ నిర్ధారించింది. ఈ చారిత్రక గ్రామం పోలవరం ప్రాజెక్టు రాకతో పూర్తిగా మునిగిపోనుంది.

-వివరాలు ..6లో

SOUTH INDIAN Bank

సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, ప్రాంతీయ కార్యాలయం, హైదరాబాద్
నం.157/6, మొదటి అంతస్తు, CHAI కాంప్లెక్స్, స్టాఫ్ రోడ్, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, సిఖ్ విలేజ్, డైమండ్ పాయింట్, సికింద్రాబాద్-500009

Ref: RO-HYD/REC/GEN/0555/2024-25 తేది:20.01.2025

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) & 9(1) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

1) **శ్రీమతి గార్లపాటి మీనాకుమారి,** (మెస్సర్స్ శ్రీ శ్రీనివాస కోయిర్ ప్రొడక్ట్స్ యజమానురాలు), 20/16/6ఎ, బత్తులవారిగూడెం రోడ్, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్, భారతదేశం-534460 **మరియు** ఇ.నం.15-17, శివాలయం వీధి, శివాలయం ప్రక్కన, చింతలపూడి మండలం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్, - 534460.

2) **శ్రీ గార్లపాటి సురేష్ కుమార్,** (మెస్సర్స్ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ యజమాని), 5-5-520/ఎ, ఎస్‌బిఐ బ్యాంక్ సమీపమున, అభ్యుదయనగర్, ఎల్‌బి నగర్, చింతల్‌కుంట, సరూర్‌నగర్, రంగారెడ్డి **మరియు** ఇ.నం.15-17, శివాలయం వీధి, శివాలయం ప్రక్కన, చింతలపూడి మండలం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్, - 534460.

3) **శ్రీ గార్లపాటి మణికంఠ,** ఇ.నం.15-17, శివాలయం వీధి, శివాలయం ప్రక్కన, చింతలపూడి మండలం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్, - 534460.

4) **శ్రీమతి గార్లపాటి హారిక,** ఇ.నం.15-17, శివాలయం వీధి, శివాలయం ప్రక్కన, చింతలపూడి మండలం, చింతలపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్, - 534460.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా స్వా